క్లుప్తంగా

వైభవంగా ఏరువాక పౌర్ణమి



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు వైభవంగా జరుపుకున్నారు. శివాలయాలు, విఘ్నేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పొలాల్లో ఏరువాక సాగారు. ఈ సందర్భంగా స్థానిక మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి రైతులకు సంబంధించిన అతి పెద్ద పండగ అని అన్నారు. తొలకరి ఆసన్నమవగా దున్నడానికి సిద్ధంగా ఉన్న పంట పొలాన్ని శుద్ధి చేసుకుని సేద్యం మొదలుపెట్టే ఉత్సవాన్ని ఏరువాక పున్నమి అంటారన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు శనివారం మెగా జాబ్ మేళాను డిగ్రీ కాలేజీ యాజమాన్యం, బల్క్ డ్రగ్స్, దివిస్ లబోరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ ఆవుల జనార్దన్ మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 94 మంది హాజరు కాగా 42 మంది ఎంపికైనట్లు తెలిపారు. అందులో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ నుంచి 18 మంది ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలోనే ఉద్యోగాల్లో చేరుతారని బల్క్ డ్రగ్స్, దివిస్ లబోరేటరీస్ హెచ్ఆర్ కొర్రా కృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, స్కాలర్స్ డిగ్రీ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు వివరాలు నోటీసు బోర్డులో పెట్టాలి

ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్

పిడుగురాళ్ల: ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఒక్కో విద్యార్థికి ఒక్కో రకమైన ఫీజు వసూలు చేయటం సరైన పద్ధతి కాదన్నారు. అంతేకాకుండా పుస్తకాలు, టై, బెల్టు వంటివి కూడా అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై పలు సార్లు జిల్లా స్థాయి అధికారులను సంప్రదించినప్పటికీ వారు ఎలాంటి స్పందన చూపించలేదని ఆయన పేర్కొన్నారు. వెంటనే ఉన్నతాధికారులు ఫీజులకు సంబంధించిన వివరాలు నోటీసు బోర్డులో ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు.

సికిల్ సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలు



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): సికిల్ సెల్ ఎనిమియా అంటు వ్యాధి కాదని, జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందని పీహెచ్‌సీ సూపర్ వైజర్ ఎ.పీటర్ డేమియన్ చెప్పారు. కుందురువారిపాలెం, చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో శనివారం జరుగుతున్న సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్ధారణ పరీక్షల తీరును ఆయన పరిశీలించారు. ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో భాగంగా 2047 నాటికి సికిల్ సెల్ ఎనిమియాను నిర్మూలించటమే లక్ష్యంగా ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా గ్రామాల్లో ప్రధానంగా ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. మండలంలో మొత్తం 1,384 మంది ఎస్టీ జనాభాకు పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే రుద్రవరం, మాదల-2, చాగంటివారిపాలెం, గోళ్ళపాడు, ఇరుకుపాలెం గ్రామాల్లో 175 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రక్త హీనత సంభవిస్తుందని, తద్వారా తరచూ అంటు వ్యాధుల బారిన పడాల్సి వస్తుందన్నారు. తప్పనిసరిగా వైద్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం.జోస్పిన్ రాణి, ఏఎన్ఎంలు శోభారాణి, ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ రహీమున్నీసా, కమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం షుగర్, బీపీ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాన్నిలింగమల్ల మోహన్ భాస్కర్ పర్యవేక్షిస్తారన్నారు.

సర్కారు బడి.. సదుపాయాల ఒడి

సద్వినియోగంతోనే సత్ఫలితాలు

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారు చేస్తున్నారు. క్రీడా స్థలాల నుంచి డిజిటల్ తరగతుల వరకు వసతులు కల్పిస్తున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వం నిరంతరం విద్యా వ్యవస్థ పై ప్రత్యేక పర్యవేక్షణ చేయడం, నూతన పథకాలను ప్రవేశ పెట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మరింత మెరుగయ్యాయి. ఇంగ్లీష్ మీడియం కూడా అందుబాటులోకి వచ్చింది. సత్తెనపల్లి నియోజకవర్గంలో 230 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 22,482 మంది విద్యార్థులు విద్యన భ్యసిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుంది.

ఏకరూప దుస్తులు.. ఉచితంగా పుస్తకాలు

ప్రతి విద్యార్థికి మూడు జతల ఏకరూప దుస్తులను ఏటా ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది. కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో పోటీపడేలా వస్త్రధారణ ఉంటుంది. ఉచితంగా పాఠ్య పుస్తకాలను, నోట్ బుక్స్, బ్యాగు అందిస్తున్నారు.

గ్రంథాలయాల నిర్వహణ...

చిన్నతనం నుంచి విద్యార్థులకు పుస్తక పఠనం అలవర్చేందుకు పాఠశాలల్లోనే గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. పాఠశాలకు మంజూరయ్యే నిధుల్లో కొంత మొత్తాన్ని దీనికి వెచ్చించి నిర్వహణను చేపడుతున్నారు. నైతిక విలువలతో కూడిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచి వారి ఆసక్తిని పెంపొందిస్తున్నారు. స్టూడెంట్ కిట్‌తో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తున్నారు.

డిజిటల్ బోధన...

పాఠాలను విద్యార్థులు ఆసక్తిగా వినేందుకు డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఆకట్టుకునేలా తెరలపై బోధిస్తూ చరిత్రకు సంబంధించిన అంశాలను వాటిపై ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులకు ట్యా సైతం పంపిణీ చేయడంతో అన్ని చేతిలోనే జరిగి పోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు దూరంగా ఉంటే విద్యార్థులు అక్కడికి వచ్చేందుకు వీలుగా బస్సు పాస్‌లను ఇస్తుంది. ఈ పాసు ద్వారా ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చు. 12 ఏళ్లలోపు బాలురకి, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచిత పాస్‌లు అందిస్తున్నారు. వీటితో 20 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు.



సర్వాంగసుందరంగా పెదమక్కెన ప్రాథమిక పాఠశాల

సత్తెనపల్లి నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
సత్తెనపల్లి	93	9,903
ముప్పాళ్ళ	35	2,837
రాజుపాలెం	55	4,438
నకరికల్లు	47	5,304
మొత్తం	230	22,482



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యా శాఖాధికారులు

సద్వినియోగంతోనే సత్ఫలితాలు



ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల్ని చదివించాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తమ సంపాదనలో సగానికి పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితమే అన్న విషయాన్ని తల్లిదండ్రులు ఆలోచించాలి. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా అన్ని సౌకర్యాలతో ఆహ్లాద కరమైన బోధన అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు కార్పొరేట్‌కు దీటుగా ఉన్నాయి.

–ఏ శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

కౌలు రైతు కార్డులపై అవగాహన

మాచవరం: భూ యజమానుల అంగీకారంతో కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందవచ్చని, దాని వల్ల భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగవని, కేవలం పంటపై మాత్రమే కౌలు రైతుకు హక్కు ఉంటుందని విషయాన్ని భూ యజమానులు గ్రహించి కౌలు రైతులకు సహకరించాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండల కేంద్రమైన మాచవరం సచివాలయం నందు కౌలు రైతు కార్డులపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్డుల వల్ల ఎరువులు, విత్తనాలపై రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంటకు మద్దతు ధరలు లభిస్తాయని తెలియజేశారు. కౌలు రైతు కార్డులు కావాల్సిన రైతులు భూ యజమాని పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్ కాపీ, ఫోను నంబరుతో పాటు రైతు పాస్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఫోను నంబరు, దరఖాస్తుతో పొందుపర్చి గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు పరిశీలించి కౌలు రైతు కార్డులు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కరుణకుమారి, వీఆర్ఓ శ్రీలక్ష్మి, ఆర్ఐ కోటేశ్వరావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పుసులూరి రామయ్య, గుదె శ్రీనివాసరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ కె.రామమ్మ

అర్చకుల గౌరవ వేతనం పెంచటం హర్షణీయం

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు, ఎన్డీఏ కూటమి సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గతంలో అర్చకులకు దీపదూప నైవేద్యం కోసం ఇస్తున్న గౌరవ వేతనం రూ.5వేలను రూ.10 వేలు చేయడం హర్షించదగిన విషయమన్నారు. అనంతరం నాగులగుడి దేవస్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్ల మీద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రాహ్మణ సంఘ సభ్యులు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.



కూటమి, బ్రాహ్మణ సంఘ సభ్యులు

నాణ్యమైన విద్య.. ప్రభుత్వ లక్ష్యం

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని బట్లూరు గ్రామ సర్పంచ్ ఈదర రామారావు అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే అన్ని రకాల సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగంచేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నేను బడికి పోతా కార్యక్రమం షెడ్యూల్‌ను విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బడి బయట పిల్లలు ఉన్నట్లయితే వారిని పాఠశాలలో చేర్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం కె.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాలో తృతీయ స్థానం సాధించిన భానోజీ

సత్తెనపల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో 51-60 సంవత్సరాల విభాగంలో రుషి ప్రభాకర్ జి.మెమోరియల్ యోగా కేంద్రం గుంటూరు వారు శుక్రవారం నిర్వహించిన పోటీల్లో సత్తెనపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్, నిత్యయోగ సాధకుడు పులహరి భానోజీ ప్రతిభ చూపి, తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా గుంటూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పులహరి భానోజీని యోగా నిర్వాహకుడు అంకమ్మరావు, సత్తెనపల్లి పట్టణ యోగ సాధకులు జేపీఎస్ శాస్త్రి, సునీల్ చౌదరి, లక్ష్మయ్య, రంగారావు, రమేష్, దేవరశెట్టి రవికుమార్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు.



డొక్కా మాణిక్యవరప్రసాద్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న భానోజీ

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

అచ్చంపేట: జంతువులు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.స్వాతీదేవి పేర్కొన్నారు. జంతు హక్కుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వేల్పూరు జెడ్పీ హైస్కూల్లో శనివారం ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హానిచేస్తాయన్న సాకుతో కుక్కలు, కోతులు వంటి జంతువులను హింసించడం, చంపడం నేరమన్నారు. వాటివల్ల నిజంగా నష్టం కలిగితే స్థానిక పంచాయతీ వారికి ఫిర్యాదు చేస్తే వాటిని తీసుకెళ్లి సమీపంలోని అడవులలో వదులుతారని చెప్పారు. అంతేగాని వాటిని చంపొద్దని హితబోధ చేశారు. జంతువుల వల్ల అనేక లాభాలు కూడా ఉంటాయన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అవకాశమున్నంత వరకు జంతువులను ప్రేమించడం, మచ్చిక చేసుకోవడం వాటికి కావలసిన ఆహారాన్ని అందచేయడం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వాతీదేవి

ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

సత్తెనపల్లి: ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో అప్పుల బాధలు తాళలేక పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ధూళిపాళ్ల బ్రహ్మయ్య కుటుంబాన్ని శనివారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు ధూళిపాళ్ల బ్రహ్మయ్య కుటుంబానికి రూ. 20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంటల బీమా పథకాన్ని నీటి వసతి ఉన్న పొలాలకు కూడా వర్తింప చేయాలన్నారు. ప్రతిపక్షంలో కౌలు రైతులను ఆదుకునేందుకు రూ. లక్ష సాయం అందించిన పవన్ కళ్యాణ్ ప్రస్తుతం యెన్డీఏ కూటమిలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్న ఆయన కౌలు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన కౌలు రైతు బ్రహ్మయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు వారి పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా మృతి చెందిన కౌలు రైతు బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వేపూరి గోపాల రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె చలమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు తదితరులు ఉన్నారు.



అబ్బూరులో మాట్లాడుతున్న రాధాకృష్ణ, సంఘ నాయకులు

టీడీపీ వ్యవహారంపై జనసేన వర్గాల్లో అసహనం

- అరవిందబాబు న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది
- జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఇన్‌చార్జి సయ్యద్ జిలాని
- మరికొన్ని రోజులు వేచిచూద్దామంటూ కార్యకర్తలకు సూచన

నరసరావుపేట: అన్నింటిలో మాకు రావాల్సిన 33 శాతం అందజేయటంలో కూటమి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు న్యాయం చేస్తారనే నమ్మకం తనకు ఉందని, అప్పటివరకు కార్యకర్తలు ఆగాలని జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమకు సరైన న్యాయం జరగడం లేదని జనసేన నాయకులు, కార్యకర్తలు చేస్తున్న ఆగ్రహావేశాలపై శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించి సముదాయిస్తూ మాట్లాడారు. ఎన్నికలకు ముందు మన పార్టీకి అన్నింటిలోను సరైన ప్రాధాన్యం ఇవ్వాలని కండిషన్ పెట్టి పైసా ఆశించకుండా ఆయన విజయానికి కృషి చేశామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఇటీవల ఎమ్మెల్యే కార్యాలయంకు వచ్చి మనకు రావాల్సిన 33 శాతం ఇవ్వటం జరుగుతుందని హామీ ఇచ్చారన్నారు. మనల్ని ఇబ్బంది పెట్టకుండా మనకు న్యాయం చేస్తాడనే నమ్మకంతో ఉన్నానన్నారు. నాలుగు రోజులు ఆగుదామని, ఇస్తాడని అనుకుంటున్నానని అప్పటివరకు వేచి చూద్దామని కార్యకర్తలకు ఇన్‌చార్జి జిలాని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు జీవీఎస్ ప్రసాదు, షేక్ ఆష్రూఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సయ్యద్‌జిలాని

కౌలు రైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం రైతు భరోసా కేంద్రంలో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం ఏవో వేణుగోపాల్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పి.రామయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు గుర్తింపు కార్డులు పొందటం వల్ల ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందుతారన్నారు. కౌలు కార్డు ఉండటం వల్ల ఈ- క్రాపింగ్ ద్వారా పంట మద్దతు ధరకు విక్రయించుకునేందుకు, పంట బీమా పొందేందుకు, పంట నష్టం జరిగినపుడు ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు, బ్యాంకుల నుంచి పంట రుణం పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. కావున కౌలు సాగు దారులందరూ కౌలు కార్డులు పొందాలన్నారు.



ఆర్బీకేలో మాట్లాడుతున్న ఏవో వేణుగోపాల్



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏఓ అరుణ, తహసీల్దారు సింగారావు

కౌలు రైతులు సీసీఆర్ కార్డులు తీసుకోవాలి

నకరికల్లు: మండలంలోని కౌలుదారు రైతులు అందరూ సీసీఆర్ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో శనివారం నిర్వహించిన కౌలు రైతుల అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి సీసీఆర్ కార్డులు పొందవచ్చని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ 11 నెలల కాల పరిమితితో కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా భూసార పరీక్షల కోసం 588 మట్టి నమూనాలు సేకరించినట్లు వెల్లడించారు. స్థూల, సూక్ష్మపోషకాల లభ్యత, సేంద్రియ పదార్థం లభ్యత నేల ఉదజని సూచికతో పాటు వివిధ పంటలకు ఎరువులు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సీహెచ్.యువరాజు, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (కౌలు రైతు కార్డు) అందించేందుకు సత్తెనపల్లి మండలం గోరంట్ల, కట్టమూరు, రెంటపాళ్ళ, పాకాలపాడు గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు సీహెచ్ కాశీ భాస్కరరావు, డి.నాగేశ్వరరావు, ఎంటీ నాగేశ్వరరావు, వీహెచ్ఏలు కె.అభిరాం, డి.అమర్ ఫణీంద్రనాథ్, గాలి భరత్‌లు హాజరై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తులు అందించాలన్నారు. ఆయా సభల్లో కౌలు రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై గ్రామసభ

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో కౌలు రుణ అర్హత కార్డుల ఎంపికపై శనివారం గ్రామ సభ జరిగింది. గ్రామ సభలో తహసీల్దారు పి.సింగారావు, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొన్నారు. కౌలు రుణ అర్హత కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీ విత్తనాలు, పంట నష్టపరిహారం పొందవచ్చన్నారు. దిగుబడులకు మార్కెట్ ధర లభించినప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చన్నారు. గ్రామ సభలో ఆర్.ఐ కపిల్, వీఆర్వో సుమతి పాల్గొన్నారు.

దొడ్లేరులో నేను బడికి పోతా కార్యక్రమం



దొడ్లేరు(క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలోని ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాల హెచ్ఎం టి.సామ్రాజ్యం ఆధ్వర్యంలో శనివారం నేను బడికిపోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. హెచ్ఎం మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులను తప్పకుండా బడికి పంపించాలన్నారు. బడి బయట ఉండకూడదన్నారు. ఆవాస ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.సదాశివారెడ్డి, టి.ప్రకాశరావు, ఉపాధాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట సాగుదారు హక్కు పత్రాలు పొందాలి

బెల్లంకొండ: కౌలు రైతులందరూ తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రాలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. శనివారం మండలంలోని చంద్రారాజుపాలెం, న్యూ చిట్యాల గ్రామాల్లో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రాజుపాలెంలో మాట్లాడుతూ భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబరుతో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి సీసీఆర్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట సాగుదారు హక్కు పత్రం 11 నెలలు గడువు కలిగి భూ యజమాని హక్కులకు భంగం కలుగకుండా జారీ చేయబడతాయన్నారు. కావున భూ యజమాలు పంట సాగుదారులకు సహకరించాలన్నారు. పంట నమోదు తద్వారా పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పొందుటకు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టాలు సంభవించిన పంట నష్ట పరిహారం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు పొందుటకు పంట సాగుదారు హక్కు పత్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. కావున అర్హులైన వారు అందరు సీసీఆర్ కార్డులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్నాయపాలెం, కందిపాడు గ్రామ వీఆర్వో ఎస్కే కిస్మాతున్నిసా, గ్రామ ఉద్యాన సహాయకురాలు రజని, వీఏఏ అషాబీ గ్రామ రైతులు పాల్గొన్నారు.



చంద్రాజుపాలెంలో మాట్లాడుతున్న ఏఓ కృష్ణయ్య

పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్ పరిసర ప్రాంతాల్లో అన్నార్తులకు అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో దాత ఎస్.సుప్రజ పుట్టినరోజు సందర్భంగా భోజనం ప్యాకెట్లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ కె.దస్తగిరి మాట్లాడుతూ సంస్థకు దాతలు చేస్తున్న సహకారం ఎన్నటికి మరువలేనిదన్నారు. సభ్యులు క్యాలిబర్ జానీ, ప్రత్తిపాటి హరే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

సత్తెనపల్లి: పెన్షనర్లు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ శెట్టిపల్లి శరవణ ప్రమోద్ అన్నారు. పట్టణంలోని ఏపీ పెన్షనర్స్ హోం కార్యాలయంలో శనివారం పెన్షనర్లకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరవణ ప్రమోద్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు ఆహార నియమాలు పాటించడంతో పాటు నిర్ణీత సమయానికి మందులు వేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, రక్త పరీక్షలు, నరాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. 45 మంది శిబిరంలో వైద్య సేవలు పొందారు. అనంతరం డాక్టర్ శరవణ ప్రమోద్‌ను ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు రామారావు, ప్రధాన కార్యదర్శి జక్కుల లక్ష్మీనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు సయ్యద్ నూర్‌మోహిద్దీన్, కేబీఆర్‌జే.ప్రసాద్, కె.రంగారెడ్డి, చింతపల్లి వెంకటాద్రి, శృంగారం, నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.